శాపగ్రస్థుడు

వసుంధర

గుబురుగా వున్న క్రోటన్స్ మొక్కల వెనుక కూర్చుని వున్నాడతను. అతడి చేతిలో కత్తివుంది.

రాఘవరావు దొడ్లో పడకకుర్చీలో కూర్చుని వున్న వాడల్లా వున్నట్లుండి లేచి క్రోటన్సు మొక్కల దగ్గరకు వెళ్ళాడు.

అతడు ఊపిరి బిగబట్టాడు. కత్తివంక ఓసారి చూసుకుని—"అప్పుడే కాదు—" అనుకున్నాడు.

రాఘవరావు మొక్క దగ్గర ఆగాడు. ఓ ఆకు త్రుంచాడు. దాన్ని సగానికి మడిచి వాసన చూశాడు.

క్రోటన్సు ఆకు మధ్యకు మడిచినప్పుడు చిట్లుతుంది. అప్పుడదొకరకమైన వాసన వేస్తుంది. ఆ వాసన రాఘవరావుకెంతో ఇష్టం. అయినా ఆకుని తీసుకొని మళ్ళీ వెళ్ళి పడకకుర్చీలో కూర్చున్నాడు.

రాఘవరావు ఆకాశంకేసి చూస్తూ ఏమో ఆలోచిస్తున్నాడు.

4

"ఎప్పటికీ ఆయనక్కణ్నించి కదలడేం?" అనుకున్నాడతను. ఆయనింట్లోకి వెడితే తప్ప తనకూ అవకాశం రాదు. ఆయన చాలా సేపట్నుంచి అక్కడే కూర్చున్నాడు. అతడిలో సహనం చచ్చిపోతోంది.

చేతిలో కత్తి వుంది. కాని తను హత్య చెయ్యడానికి రాలేదు. అది కేవలం ఆత్మరక్షణకు కూడా తెచ్చుకొచ్చాడు. ఇంట్లో యెవరికంటా బడకుండా లోపలకు వెళ్ళి తానను కున్న పని సాధించాలి. సాధిస్తే!?

రాఘవరావు లేచాడు. ఇంట్లోకి వెళ్ళాడు.

అతడికి తెలుసు. ఇంట్లో ఎవ్వరూ లేరు—ఆయనతప్ప!

ఇంట్లోకి ఎలా ప్రవేశించాలో కూడా అతడికి తెలుసు. అతడు చప్పున దొడ్లోంచి అటు పరుగెత్తి స్నానాల గది సమీపించాడు. స్నానాల గది కిటికీలోంచి అతడు లోపలకు గెంతాడు.

లోపల అంతా పొడిగా వుంది.

అతడికా యిల్లు క్షుణ్ణంగా తెలుసు. స్నానాల గదిలోంచి ఓ మూలకు వెళ్ళాడు. అక్కణ్నించి చూస్తూంటే మనిషి కనబడకపోయినా రాఘవరావెక్కడున్నదీ అలికిడి తెలుస్తుంది. రాఘవరావు ఇప్పట్లో ఇటు వచ్చేలా లేడు. అతడు చప్పున పక్కనే వున్న గదిలోకి దూరాడు.

గదిలో అతడు చూసిన దృశ్యం.........

మంచంమీద రాఘవరావు....అతడి గుండెల్లో కత్తి..

కెవ్వుమని కేక వేయబోయి ఆగాడతను.

అతడి వెనుకనే ఆ గది తలుపులు మూసుకున్నాయి.

2

"నా పేరు శారద!" అన్నదా యువతి.

సీతమ్మ, రాజమ్మ వెంటనే ఆ విషయం నోట్

చేసుకున్నారు.

"శశికాంత్‌కూ నాకూ పెళ్ళి నిశ్చయమయింది—" అందామె మళ్ళీ.

వెంకన్న తమాషాగా తలూపి—"శశికాంత్ ఇప్పుడు పోలీసు కస్టడీలో ఉన్నాడు కదూ!" అన్నాడు.

"అవునండి. కానీ అతడు అమాయకుడు. అన్యాయంగా ఎవరో అతణ్నిందులో ఇరికించారు. అతడినిప్పుడు మీరు తప్ప యెవ్వరూ కాపాడలేరు...."

"అతడు నిర్దోషి కాని పక్షంలో నేనూ కాపాడలేను" అన్నాడు వెంకన్న.

శారద నిబ్బరంగా చూసింది డిటెక్టివ్ వంక—"వెంకన్నగారూ—దోషులను కాపాడమని నేను మీకు చెప్పను. శశికాంత్ దోషి అయిన పక్షంలో అతడిని ప్రేమించినందుకు పశ్చాత్తాప పడతాను కూడా! అయితే ఈ ప్రపంచమంతా ఏకమై అతడు దోషి అని ఘోషించినా నేను నమ్మను. కానీ మీరు పరిశోధించి అదే విషయం ధృవపరిస్తే నమ్ముతాను. మీరిప్పుడు అతడిని రక్షించవద్దు. అతడి గురించిన నిజాన్ని తెలుసుకోండి—"

"శభాష్!" అన్నాడు వెంకన్న. తన అసిస్టెంట్సువంక చూసి—"ఈమె అన్న మాటలు సాహిత్యంలో ఉంచదగ్గవి. సరిగ్గా నోట్ చేశారా?" అనడిగాడు. సీతమ్మ, రాజమ్మ తలలూగించారు.

"అసలేం జరిగిందో చెప్పమంటూరా?" అంది శారద.

"అవసరంలేదు. నేను చెబుతాను. అంతా సావధానంగా విని — నా కథలో లోపాలుంటే నువ్వు చెప్పు—" అన్నాడు డిటెక్టివ్ వెంకన్న.

శారద ఆశ్చర్యంగా అతడివంక చూసింది. అతడు చెప్పనారంభించాడు.

* * *

శశికాంత్ రాఘవరావు మేనల్లుడు. బియ్యే ప్యాసయ్యాడు. మేనమామ కోరికమీద ఆయనకు ఆస్తి వ్యవహారాల్లో సాయపడడానికి ఆర్నెల్ల క్రితం ఈ ఊరు వచ్చాడు. రాఘవరావు కతడు నచ్చాడు. తన కూతుర్నిచ్చి పెళ్ళి చేయాలనుకున్నాడు. అతడంగీకరిస్తాడన్న నమ్మకంతో శశికాంత్ పేరున లక్షరూపాయల ఆస్థి రాశాడు. రాఘవరావు కొక్కగానొక్క కూతురు.

ఈ ఊరొచ్చిన నెలరోజుల్లోనే శశికాంత్ కి శారదతో పరిచయమైంది. అతడామెనీ, ఆమె అతడినీ ప్రేమించడం జరిగింది. శారద ఇంటర్మీడియేట్ ప్యాసై తర్వాత చదువు మానేసింది. ఆమె రోజూ పార్కుకి వస్తూంటుంది. అక్కడే శశికాంత్ ని కలుసుకుంటూండేది చాలా తరచుగా.

రాఘవరావుకి శశికాంత్, శారదల వ్యవహారం తెలియడానికి కొద్ది నెలలు పట్టింది. తెలియగానే ఆయన తన మనసులోని ఉద్దేశ్యం గురించీ, వీలునామా గురించీ చెప్పాడు. వినగానే శశికాంత్ బుర్ర తిరిగిపోయింది.

లక్షరూపాయల ఆస్థి అంటే అతడికి మాటలుకాదు. చూస్తూ చూస్తూ దాన్ని వదులుకోలేడు. అయితే రాఘవరావు కూతురు అతడికి బొత్తిగా నచ్చలేదు. బహుశా ఆమె ఏ మగవాడికీ నచ్చకపోవచ్చునని శశికాంత్ అనుమానం.

అతడు నెమ్మదిగా తను శారదను ప్రేమించిన విషయం ఆయనకు చెప్పుకున్నాడు.

"అన్నీ తెలిసే నిన్ను పిలిచాను. నీ మనసు మార్చుకో గలవేమో చెప్పు. లేనిపక్షంలో నా వీలునామా మార్చు కుంటాను—" అన్నాడు రాఘవరావు.

శశికాంత్ వారంరోజుల వ్యవధి అడిగాడు. ఈలోగా రాఘవరావు కుటుంబం—బంధువుల పెళ్ళికి పొరుగూరు వెళ్ళారు.

శశికాంత్ గడువు పూర్తికావడానికి ఆఖరిరోజున రాఘవరావు చనిపోయాడు. అది మామూలు చావుకాదు. హత్య! గదిలో ఆయన పక్కన శశికాంత్ వున్నాడు. అతడి గుండెల్లో దిగబడిన కత్తిమీద వేలిముద్రలు—శశికాంత్ వి.

ఎవరో శశికాంత్ ని చూశారు. గది తలుపులువేసి పోలీసులకు ఫోన్ చేశారు.

మేనమామ వీలునామా మారుస్తాడన్న భయంతో శశికాంత్ ఆయన్ను చంపేశాడు—అని పోలీసులంటారు.

శశికాంత్ చెప్పే కథనం వేరుగా వుంది.

నాలుగు రోజుల క్రితం ఓ వ్యక్తి అతడిని కలిశాడు. రాఘవరావు ఇంటిలో అతడికి కావలసిన ముఖ్యమైన కాగితాలేవో ఉన్నాయి. అవి సంపాదించి ఇస్తే పాతిక వేల రూపాయలిస్తానన్నాడాయన. ఆ ప్రకారం పోస్ట్ డేటెడ్ చెక్కు కూడా యిచ్చాడు. బ్యాంకులో విచారించగా ఆ అక్కౌంటులో డబ్బున్నట్లు తేలింది.

శశికాంత్ ఆ కాగితాలు మేనమామ వద్దనుంచి సంగ్రహించి ఆ వ్యక్తికివ్వదలిచాడు. అయితే తనమీద మేనమామకు అనుమానం రాకూడదు. అందుకు మంచి ఉపాయం ఆ వ్యక్తి చెప్పాడు. శశికాంత్ ఆ రోజు ఊళ్ళో లేనట్లు తిరుగులేని సాక్ష్యాలు సృష్టించగలనని

చెప్పాడు. ఆ రోజు ఉదయం అతడిని మేనమామతో ఏదో ఊరు వెళుతున్నట్లు చెప్పమన్నాడు. ఆత్మరక్షణకు కత్తి ఒకటి తీసుకొని—గుర్తు తెలియకుండా ముఖానికి ముసుగు వేసుకొని రమ్మన్నాడు.

తీరా వెడితే జరిగినదిది!

* * *

"మీ కథలో లోపాలేం లేవు. కానీ పనికివచ్చే సమాచారం కొంత లేదు. ఉదాహరణకు శశికాంత్ కథ అబద్ధం కాదనడానికి-అతడు ఊళ్లో లేనట్లు సృష్టించబడిన సాక్ష్యాలున్నాయి—" అంది శారద.

"అవును—ఆ ఎలిబీ అతడు కాగితాల కోసం కాదనీ, హత్య చేయటం కోసం తనే సృష్టించుకున్నాడనీ పోలీసులు అంటున్నారు-" అన్నాడు వెంకన్న.

శారద నిట్టూర్చి — "అదీ నిజమే! అయితే అతడు చెప్పేదేమిటంటే—తనను పిలిచి పోస్టు డేటెడ్ చెక్కు ఇచ్చిన వ్యక్తి తెలివిగా తనని హత్యలో ఇరికించాడని! ఆ వ్యక్తి శశికాంత్ కి నాలుగైదు కత్తులు చూపించి—వాటిలో ఒకటి ఎంచుకొమ్మన్నాడట. అప్పుడు తను చాలా కత్తులు తాకాననీ—ఆ విధంగా తన వేలిముద్రలు కత్తిమీదకు వెళ్ళివుంటాయనీ అతడంటున్నాడు. తనవద్ద వున్న కత్తి ఉపయోగించనే లేదుకదా!" అంది.

"దానికేముంది? అతడివద్ద రెండు కత్తులుండి వుండవచ్చు—"

"మీరు కూడా పోలీసులకు వలెనే ఆలోచిస్తున్నారు—" అంది శారద దీనంగా.

"నువ్వలా కంగారుపడకు. హతుడి కత్తిమీది వేలిముద్రలు శశికాంత్ ని హంతకుడిని చేయవు. నేనోసారి

అతణ్ని కలుసుకొని మాట్లాడితేగానీ ఏ విషయమూ చెప్పలేను. ఇంతకీ నువ్వు నాకేమైనా ఫీజు ఇచ్చుకో గలవా?" అన్నాడు వెంకన్న.

శారద పర్సు తెరిచింది. పది వందరూపాయల నోట్లు వెంకన్నకు అందించి—"ప్రస్తుతానికి ఇంతే ఇచ్చుకో గలను—" అంది.

వెంకన్న ఆశ్చర్యంగా — "ఎక్కడిది నీకీ డబ్బు?" అన్నాడు.

"నా చేతికి ఉన్న బంగారు గాజులు తాకట్టు పెట్టాను. ఇంటిలో వాళ్ళకి అనుమానం రాకుండా అలాంటివే నకిలీవి కొన్నాను—" అందామె.

వెంకన్నా వెయ్యి రూపాయలూ ఆమెకు తిరిగిచ్చేసి మరో పదిరూపాయల నోటు కూడా ఆమెకు అందించి— "ఈ పదిరూపాయలూ పరిహారం చెల్లించి ఆ వెయ్యి రూపాయలూ వెనక్కిచ్చి నీ గాజు తెచ్చుకో. చాలా కేసుల్లో అవసరానికిమించే నాకు దొరుకుతోంది. శశికాంత్ విడుదలయ్యేక డబ్బు అతడి దగ్గర్నుంచి తీసు కుంటాను. ఇలా గాజులు తాకట్టు పెట్టి నా ఫీజు తీసుకు రావటం నాకు అవమానం—" అన్నాడు.

శారద గంభీరంగా—"దీన జనోద్ధరణ కోసమే మీరు ఇక్కడ బల్లకట్టి ప్రాక్టీసు పెట్టినట్లయితే త్వరలో నే మీరూ వాళ్ళలో ఒకరు కావాల్సొస్తుంది—" అంది.

"దీన జనోద్ధరణ నా ధ్యేయంకాదు. అలాగని సాయం పేరుతో వాళ్ళను దోపిడీ చెయ్యటం నావల్లకాదు—" అన్నాడు వెంకన్న.

అప్పుడే అతడి బల్లమీద ఫోన్ మ్రోగింది.

"డియర్! నేను వంటింటిలోంచి మాట్లాడుతున్నాను.

మీరు నాకు చాలా నచ్చారు. ఒక్కసారి లోపలకు వస్తే మంచి బహుమతి ఇస్తాను—" అంది పద్మావతీదేవి.

వెంకన్న ఫోన్ క్రెడిల్ చేసి-"నువ్వింక వెళ్ళొచ్చు-" అన్నాడు. శారద అతడికి నమస్కరించి వెళ్ళిపోగానే వెంకన్న లేచాడు.

"బహుమతి అంటే ముద్దే కదూ?" అంది సీతమ్మ.

"నా స్వంత ఫోన్ వినవద్దని ఎన్నిసార్లు చెప్పాలి మీకు?" అన్నాడు వెంకన్న కోపంగా. అది నిజమైన కోపం కాదని పదునెనిమిది వత్సరాల ప్రాయపు అసిస్టెంట్సిద్దరకూ తెలుసు. అందుకని వారతడి కోపానికి భయపడినా అది నటన మాత్రమే!

"బాస్! నేనెప్పుడూ మీ స్వంత ఫోన్ వినను. ఈ సీతమ్మకు బుద్ధి లేదు. అయినా వెళ్లేది వంటింటిలోకేనా అని అడగడానికి బదులు—బహుమతి అంటే ఏమిటని అడగడమెందుకూ?" అంది రాజమ్మ.

"మీరు కేసు గురించి నోట్సు తయారు చేయండి. నేను పదినిమిషాల్లో వస్తాను—" అంటూ లోపలకు వెళ్ళాడు డిటెక్టివ్ వెంకన్న.

3

మర్నాడుదయం డిటెక్టివ్ వెంకన్న పోలీస్ స్టేషన్లో శశికాంత్ ని కలుసుకొని అతడి కథనమంతా విన్నాక ఇన్స్పెక్టర్ తో మాట్లాడేడు. అందులో ఒక విచిత్రం బయటపడింది.

పోస్టుమార్టం రిపోర్టు ప్రకారం హతుడు మధ్యాహ్నం మూడు గంటలకు చంపబడ్డాడు. శశికాంత్ పాదల మాటున సాయంత్రం నాలుగూ నలభై అయిదు నుంచి గంటసేపున్నానంటున్నాడు. ఆ సమయంలో

అతడు రాఘవరావుని చూశానంటున్నాడు. యెలా సాధ్యం?

"అదంతా కట్టు కథ. మీరు నమ్మకండి-" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"అది సరే — హంతకుడినంత ధైర్యంగా గదిలో బంధించిన ఆ మనిషి ఎవరు? అతడక్కడికి ఎప్పుడు, ఎలా చేరుకున్నాడు?" అన్నాడు వెంకన్న.

"అవన్నీ మనకు అనవసరం. దొరకని సాక్ష్యాల గురించి తల బద్దలు కొట్టుకోవటం మీ డిటెక్టివుల పని. దొరికిన సాక్ష్యాలు కేసును తేల్చేస్తున్నపుడు ఇవన్నీ మాకెందు చెప్పండి!" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

వెంకన్న నవ్వి — "ఎందుకో చెప్పమంటారా?" అన్నాడు. ఇన్‌స్పెక్టర్ బదులిచ్చేలోగానే—"మీ కేసు కోర్టులో నిలబడదు. మీ కథలో చాలా లోపాలు వున్నాయి. హత్య మధ్యాహ్నం మూడింటికి జరిగింది. పోలీసులకు ఫోన్ ఆరుంపావుకి వచ్చింది. హంతకుడు గదిలో ఎన్ని గంటలకు బంధింపబడ్డాడు? మూడింటికా-ఆరింటికా? మూడింటికే అయితే హంతకుడిని బంధించిన వ్యక్తి ఆరుంపావుదాకా ఎందుకు పోలీసులకు ఫోన్ చెయ్యలేదు? ఆరింటికనుకుందామా అంటే హత్య జరిగేక అంతసేపు హంతకుడక్కడేం చేస్తున్నాడు?" అనడిగాడు వెంకన్న.

ఇన్‌స్పెక్టర్ కొంతసేపు ఆలోచించి—"ఇందులో పెద్ద విశేషమేముంది? హంతకుడు తన వేలిముద్రలు కత్తి మీద ఉండిపోయుంటాయని మళ్ళీ వచ్చివుంటాడు. అతడాయింటిలోకి వెళ్ళటం చూసిన ఏ ఎదురింటాయనో అనుమానించి లోపలకు వెళ్ళి జరిగింది చూసి అతడిని

గదిలో బంధించి పోలీసులకు ఫోన్ చేసి ఉంటాడు—"
అన్నాడు.

"చాలా బాగుంది. శశికాంత్ ఆ ఇంటిలోని మనిషేనని మీరు మర్చిపోతున్నారు. అతడా ఇంటిలోకి వెడుతూంటే ఏ ఎదురింటివారూ అనుమానించరు. అనుమానించి అనుసరించినా హత్య జరిగి అప్పటికి మూడు గంటలయింది. ఇంటిలోంచి ఏ కేకా వినబడకుండానే—గదిలో అడుగు పెట్టిన శశికాంత్‌ని హంతకుడిగా ఎలా అనుమానించటం జరుగుతుంది?" అన్నాడు వెంకన్న.

"అయితే ఏం జరిగిందంటారు?" అన్నాడు యిన్‌స్పెక్టర్ విసుగ్గా.

"జరగడానికేముంది? హంతకుడు శశికాంత్ కాదు. అతడు ట్రాప్ చెయ్యబడ్డాడు. కాస్త అనుభవమున్న నేర పరిశోధకులెవ్వరైనా ఈ విషయం గ్రహించగలరు. మీకు అనుభవంలేదని నేననను. కానీ నిర్దోషిని ఉరికంబమెక్కించే పొరపాటు జరగకూడదని ఆలోచేస్తే మీరు ఇంత త్వరగా నిర్ణయాలకు రాలేరు. మనకు కేసు తేలిపోవడం కాదు కావలసింది—దోషి పట్టుబడటం!"

ఇన్‌స్పెక్టర్ మాట్లాడలేదు.

వెంకన్న మళ్ళీ అన్నాడు-"ఈ కేసులో నేను మీకు సాయపడతాను. శశికాంత్ విషయంలో తొందరపడి మీరోక నిర్ణయానికి రాకండి—"

"థాంక్స్!" అన్నాడు ఇన్‌స్పెక్టర్—"స్పాట్‌లో దొరికిన వ్యక్తి హంతకుడు కాదని అనుమానిస్తూ పోతూంటే మా పోలీసులకు ఒక్క కేసు కూడా తేలదు. అయితే నేను తొందరపడనని మీకు హామీ ఇస్తున్నాను—"

వెంకన్న ఇన్‌స్పెక్టర్‌తో కరచాలనం చేసి అక్క ణ్నుంచి బయల్దేరాడు. అతడు తిన్నగా రాఘవరావుండే వీధికి వెళ్ళాడు. ఆ వీథిలో రాఘవరావింటికి ఎదురుగానూ, పక్కగానూ ఉండేవాళ్ళను చాలా ప్రశ్నలు వేశాడు. అతడికి పనికొచ్చే సమాచారం ఓ పదేళ్ళ కుర్రాడినుంచి లభించింది.

నల్లపాంటు, తెల్లషర్టు వేసుకొని — కుచ్చుటోపీతో ఉన్న వ్యక్తి ఒకడు సుమారు ఆరుగంటల ప్రాంతంలో రాఘవరావు ఇంట్లోంచి బయటకు రావటం ఆ కుర్రాడు చూశాడుట. మనిషికి గుబురు గెడ్డం, మీసాలున్నవట. ఆ వ్యక్తిని అంతకుముందెన్నడూ తాను చూడలేదుట. ఆ వ్యక్తి సందు మొనలో రిక్షా ఎక్కాడుట.

వెంకన్న ఆ కుర్రాడిని మెచ్చుకొని అయిదు రూపాయలు బహుమతిగా యిచ్చి మళ్ళీ ఆ వ్యక్తి కన బడితే తనకు చెప్పమన్నాడు. తర్వాత అతడు సందు మొగలోకి వెళ్ళాడు. రిక్షావాళ్ళు చాలామంది ఉన్నా రక్కడ.

వెంకన్న తన జేబులోంచి పదిరూపాయల నోటుతీసి- "ఈ డబ్బు మీదే అవుతుంది—నాక్కావలసిన సమా చారం అందిస్తే!" అన్నాడు.

వాళ్ళందరూ చాలా కుతూహలపడ్డారు.

"నల్లపాంటు, తెల్లషర్టు, కుచ్చుటోపీ, గుబురుగెడ్డం, మీసాలు — ఇవన్నీ ఉన్న వ్యక్తిని మీలో ఎవరైనా నన్న సాయంత్రం ఆరుగంటల ప్రాంతాల రిక్షా ఎక్కించు కొవటం జరిగిందా?" అన్నాడు వెంకన్న.

అక్కడున్న వారిలో ఒకడు చటుక్కున — "ఆ ఖాన్సు—అదిగో ఆ గంగన్నగాడికే వచ్చిందండి—"

అన్నాడు.

"ఏమో—నాకేం తెలియదు—" అన్నాడు గంగన్న.

తనకు సమాచారమిచ్చిన రిక్షావాడివంక చూస్తూ—

"గంగన్న చేత నిజం చెప్పిస్తే ఈ పదిరూపాయలూ నీవి. ఆపైన గంగన్న నిజం చెప్పాడంటే అతడికీ మంచి బహుమతి ఉంటుంది—" అన్నాడు వెంకన్న.

ఆ మనిషిని తను రిక్షా ఎక్కించుకున్నట్లు గంగన్నకు ఒప్పుకోక తప్పలేదు. తర్వాత గంగన్న వెంకన్నను చాటుగా తీసుకువెళ్ళి—"తన గురించి ఎవరికీ చెప్పొద్దని ఆ బాబు నాకు ఇరవై రూపాయలిచ్చాడు. ఆయన్ను నేను అన్నపూర్ణా హోటలు దగ్గర దిగవిడిచాను—" అన్నాడు.

వెంకన్న అన్నపూర్ణా హోటలుకు వెళ్ళాడు.

అటువంటి వ్యక్తి తమ హోటల్లో బసచేసినట్లు మేనేజరు ఒప్పుకున్నాడు. రూం నెంబరు పదకొండులో అతడుంటున్నాడు. అయితే రాత్రి పదిగంటలకు అతడు బయటకు వెళ్ళాడు. ఇంకా రాలేదు.

వెంకన్న తానొకసారి అతడి గదిని చూడాలన్నాడు.

అన్నపూర్ణా హోటలు ప్రొప్రయిటరు చాలా పర్యాయాలు వెంకన్నవల్ల ప్రయోజనం పొంది ఉన్నాడు. అందుకని ఆ హోటల్లో అతడికి ప్రత్యేకమైన గౌరవముంది.

మేనేజరు, వెంకన్న గదిలోకి వెళ్ళారు.

గదిలో ఆ వ్యక్తికి సంబంధించిన సామానేమీ లేదు.

మంచినీళ్ళు తాగినట్లు సూచనగా ఒక గాజు గ్లాసు ఉన్నది. అయితే వెంకన్నను ముఖ్యంగా ఆకర్షించిన వస్తువొకటుంది.

అది క్రోటన్సు ఆకు!

సగానికి మడత పెట్టబడి విరిగి ఉన్న ఆ ఆకు ఇంకా పూర్తిగా వడిలిపోలేదు. వెంకన్న చటుక్కున్న వంగి అది తీసుకొని — "మీ హోటల్లో క్రోటన్సు మొక్కలున్నాయా?" అనడిగాడు.

"లేకేం — చాలా వున్నాయి సార్!" అన్నాడు మేనేజర్.

వెంకన్న ఒక్కక్షణం నిరుత్సాహ పడ్డాడు. తర్వాత నెమ్మదిగా—"ఖరీదు ఇచ్చేస్తాను. ఈ గదిలోని గ్లాసు, కూజా నేను తీసుకువెడితే మీకు అభ్యంతరమా?" అన్నాడు.

"అయ్యో—తీసుకువెళ్ళండి సార్! ఖరీదు ప్రసక్తి వద్దు—" అన్నాడు మేనేజరు వినయంగా.

"ఈ క్రోటన్సు ఆకు కూడా నేను తీసుకువెడతాను. మీకు అభ్యంతరం లేదుకదా!" అన్నాడు వెంకన్న.

"మీరు నాతో వేళాకోళమాడుతున్నారు. ఆకు ముక్కదేముంది సార్—అది తీసుకువెళ్ళడానికి అనుమతి అడగాలా?" అన్నాడు మేనేజరు.

వెంకన్న తనలో తను నవ్వుకుంటూ—"ఈ ఆకు ఓ హంతకుడిని పట్టిచ్చే ఆధారం. ఆ హంతకుడు మీ కస్టమర్. కస్టమర్సుకి కష్టం కలిగించే పనులు ఏ హోటల్ వాళ్లూ చేయరుకదా—" అనుకున్నాడు.

"ఇంతకూ విశేషమేమిటి సార్ — ఈ గదిలో చేరిన వ్యక్తి నేరస్థుడా?" అన్నాడు మేనేజర్.

"బహుశా నేరస్థుడే అయుండవచ్చును. అతడు తిరిగి గనుక వస్తే నేనిలా వచ్చి వెళ్ళినట్లు అతడికి చెప్పకండి. కొత్త కూజా, కొత్త గ్లాసు ఇక్కడుంచండి. ఎందుకైనా

మంచిది-ఇలాంటిదే ఓ క్రోటన్సు ఆకు ఒకటి ఇదేవిధంగా మడిచి ఇక్కడ పారేయించండి. అతడు రాగానే ఫోను చేసి నాకు తెలియపర్చండి—" అని—"ఇంతకూ అతడు రూం ఎన్ని రోజులకు బుక్ చేసుకున్నాడు?" అనడిగాడు వెంకన్న.

"నాలుగు రోజులకు—...." అన్నాడు మేనేజర్.

వెంకన్న తృప్తిగా తలాడించి వెళ్ళిపోయాడు.

4

మర్నాడే పేపర్లో మొదటి పేజీలోనే ఈ హత్యా వార్త వచ్చింది.

అందులో—పోలీసులు శశికాంత్‌ని అరెస్టు చేసినట్లూ వచ్చింది. డిటెక్టివ్ వెంకన్న ఈ కేసును పరిశోధిస్తున్నట్లూ వచ్చింది. డిటెక్టివ్ వెంకన్న అభిప్రాయాల గురించి ప్రత్యేకంగా ఓ పేరా వ్రాయబడింది. అందులో ఈ హత్య కేసులో ముఖ్యాధారం ఓ క్రోటన్సు ఆకు అనీ దాని గురించి వెంకన్న అన్వేషిస్తున్నాడనీ వ్రాశారు.

వెంకన్న ఆ వార్త చదువుకుని తనలో తాను నవ్వుకున్నాడు. హంతకుడీ వార్త చదువుతాడా? చదివినా అతడికి క్రోటన్సు ఆకు గురించి గుర్తుంటుందా? ఉంటే దాని గురించి మళ్ళీ హోటలుకు వెడతాడా?

వెంకన్న తన ఆఫీసులో కూర్చున్నప్పటికీ ఏదో సందేశం కోసం ఎదురుచూస్తున్నట్లు కనిపించాడు. అతడు ఎదురుచూసిన సందేశం సుమారు పదిగంటల ప్రాంతంలో వచ్చింది.

ప్రొఫెసర్ భూషణరావు నుంచి చిన్న పార్సిల్, ఓ కవరు వచ్చాయి.

ఆ రెండింటినీ తీసుకొని వెంకన్న పోలీస్ స్టేషన్ కు వెళ్ళాడు.

ఇన్ స్పెక్టర్ వెంకన్నను ముభావంగా పలకరించాడు.

"డియర్ ఇన్ స్పెక్టర్! శశికాంత్ హంతకుడు కాదన డానికి తిరుగులేని సాక్ష్యం సంపాదించాన్ను—" అన్నాడు వెంకన్న.

ఇన్ స్పెక్టర్ కళ్ళు మెరిశాయి — "ఏ మి ట ది?" అన్నాడు.

"హంతకుడు చాలా తెలివైనవాడు. అతడు ముందు శశికాంత్ ని బుట్టలో వేసుకొని సాయంత్రం ఆరింటికి తానను కున్న చోటికి వచ్చేలా చేశాడు. అంతకుముందే తను హత్యచేసి శశికాంత్ ని గదిలో ఇరికించి తను ఇంట్లోంచి బయటపడి పోలీసులకు ఫోనుచేశాడు. అతడు ఇంట్లోంచి బయటకు వస్తూండగా కొందరు చూశారు. ఆ తర్వాత అతడు రిక్షాలో ఓ హోటలుకు వెళ్ళాడు. బహుశా హోటల్నించే పోలీస్ స్టేషనుకు ఫోనుచేశాడు. హోటల్నించే రాత్రి పారిపోయాడు. అయితే హోటల్లో అతడి గురించి సమాచారం చాలా వుంది. అతడి వేలి ముద్రలు సంపాదించాను. ఇంకా ముఖ్యమైనది-క్రోటన్సు ఆకు ...."

ఇనస్పెక్టర్ వెంకన్నను మధ్యలో ఆపి—"అవును—పేపర్లో చూశాను .... క్రోటన్సు ఆకు ప్రాముఖ్యత ఏమిటి?" అనడిగాడు.

"శశికాంత్ కథనం మీకు గుర్తులేదా?" అన్నాడు వెంకన్న—"ఆ ప్రకారం హంతకుడు ఓ క్రోటన్సు ఆకు కోసి మడిచి వాసన చూశాడు. హంతకుడు ఆకును

తర్వాత జేబులో వేసుకొని ఉంటాడు. ఆ తర్వాత హోటల్లో పారేశాడు. అది నేను సంపాదించాను...."

"కొండను తవ్వి ఎలుకను పట్టినట్లుంది. ఆ క్రోటన్సు ఆకు అదేనని ఏం చెప్పగలం?" అన్నాడు ఇనస్పెక్టర్.

"ఒకటి రెండు విశేషాలు కాకతాళీయంగా జరుగ వచ్చు. కానీ అన్నీ కాకతాళీయంగా జరుగుతాయంటే నేను నమ్మలేను. ఆ ఇంటిలోంచి ఆరుగంటల ప్రాంతాల ఓ మనిషి బైటకురావటం కొందరు చూశారు. అదే రూపురేఖలతో ఉన్న వ్యక్తిని ఆ వీధి సందు మొగలోని ఒక రిక్షావాలా అన్నపూర్ణా హోటలు దగ్గర దిగ విడిచాడు. అదే రూపురేఖలుగల వ్యక్తి అన్నపూర్ణా హోటల్లో పదకొండో నెంబరు గదిలో బసచేశాడు. ఆ గదిలో ఓ క్రోటన్సు ఆకు వుంది. ఇదంతా చూస్తే మీకు శశికాంత్ కథ నమ్మాలనిపించటంలేదూ?" అన్నాడు వెంకన్న.

ఇనస్పెక్టర్ ఆరాధగా పూర్వకంగా వెంకన్న వంక చూసి—"మీ పరిశోధనా చాతురిని అభినందించకుండా ఉండలేను. అయితే నాదొక్క సందేహం. మీరు శశి కాంత్ హంతకుడిని చూసినట్లు భావిస్తున్నారు. కానీ శశికాంత్ రాఘవరావుని చూశానంటున్నాడు. అతడు నిజమే చెబుతున్నాడనుకుందాం. శశికాంత్ ఆరుగంటలకు చూసిన రాఘవరావు మూడు గంటలకే ఎలా చచ్చి పడున్నాడు?" అన్నాడు.

"అలా అడగండి — చెబుతాను—" అన్నాడు వెంకన్న—"హంతకుడికి శశికాంత్ రాఘవరావు ఇద్దరూ బాగా తెలుసు. అతడు రాఘవరావుని హత్యచేశాక రాఘవరావులా కాసేపు నటించాడు. అది శశికాంత్

కోసం. శశికాంత్ నమ్మకం పెంచడం కోసమే అతడు క్రోటన్స్ ఆకుని త్రుంచాడు. ఆ ఆకే తనకు ప్రాణాంతక మవుతుందని అప్పటిలో అతనికి తెలియదు—"

"మీ కథనం బాగానే ఉంది. అయితే ఈ క్రోటన్స్ ఆకుతో మనమేం సాధించగలమో చెప్పండి!" అన్నాడు ఇనస్పెక్టర్.

"విజ్ఞానశాస్త్రం మారణాయుధాలను తయారుచేస్తోం దనేతప్ప అది మనుషుల దుష్టత్వానికి మారణాయుధంగా ఎలా పనిచేస్తోందో మీలో చాలామందికి తెలియదు. ఈ పార్సిల్ విప్పి చూడండి. ఈ ఉత్తరంలోని వివరాలు చదవండి—" అన్నాడు వెంకన్న—ఓ కాగితాన్ని ఇన స్పెక్టర్‌కి అందిస్తూ.

ఓ పది నిమిషాల సేపు ఇనస్పెక్టర్ అవన్నీ పరీక్షించి- "బ్రావ్ హే!" అన్నాడు.

మనుషుల చేతి వేలిముద్రలు చూడ్డానికి ఒక్కలాగునే కనబడవచ్చును. కానీ ఈ ప్రపంచంలో ఏ యిద్దరు మనుషుల వేలిముద్రలూ ఒకేలాగున ఉండవు. అది సృష్టి విచిత్రం. ప్రొఫెసరు భూషణరావు ఈ విచిత్రాన్ని మొక్కల విషయంలో పరిశోధిస్తూ చాలా విశేషాలు తెలుసుకోనడమేకాక కొన్ని కొత్త పరికరాలు కూడా కనిపెట్టాడు. ఆయన వృక్షశాస్త్ర నిపుణుడు. ఆయన పరిశోధనల గురించి ఆసక్తిగా చదివే వారిలో వెంకన్న ఒకడు.

చూడ్డానికి అన్ని ఆకులూ ఒకేలాగున ఉండవచ్చును. కానీ ఓ ఆకు ఫలానా చెట్టునుంచి త్రుంచబడిందా లేదా అన్న విషయం తెలుసుకోడానికి కొన్ని పద్ధతులున్నాయి. అదేవిధంగా ఆకు మొక్కనుంచి త్రుంచబడినాక దానిలో

వచ్చే మార్పులను బట్టి అది త్రుంచబడి ఎంతసేపయిందో చెప్పవచ్చును.

క్రితం రోజు ఉదయం వెంకన్న ఆ ఆకును తీసుకొని ప్రొఫెసరు భూషణరావు వద్దకు వెళ్ళి తన సమస్య చెప్పుకున్నాడు. ఈ కేసులో ప్రొఫెసరుకూ ఆసక్తి కలిగింది. ఆయన ఆ ఆకుపై పరీక్షలు జరిపి అది రాఘవరావు ఇంటిలో క్రోటన్సు మొక్కనుంచి హత్య జరిగిన రోజు సాయంత్రం అయిదుకూ, ఆరుకూ మధ్య త్రుంచబడిందని ధ్రువీకరించాడు. అందుకు తానే మేం పరీక్షలు చేశాడో వివరంగా వ్రాశాడాయన. ఆ క్రోటన్సు మొక్కకు చెందిన మరో నాలుగు ఆకులు కూడా పార్సిల్లో వున్నాయి.

"వెంకన్నగారూ—మీ పరిశోధనా సామర్థ్యానికి నా జోహార్లు. నేను పోలీసు ఉద్యోగినని చెప్పుకు నేందుకు సిగ్గుపడుతున్నాను...." అన్నాడు ఇనస్పెక్టర్.

"ఇందులో సిగ్గుపడవలసినదేమీ లేదు. ప్రభుత్వోద్యోగులకూ, ప్రయివేటు రంగం వ్యక్తులకూ ఆ తేడా ఎప్పుడూ ఉంటున్నదే!" అన్నాడు వెంకన్న.

"ఇప్పుడేం చేయాలంటారు?" అన్నాడు ఇనస్పెక్టర్.

"ఈ వేలిముద్రల కాపీ ఒకటి మీ దగ్గరుంచండి. ఇవి హంతకుడి వేలిముద్రలనడానికి ఏ మాత్రమూ సందేహం లేదు. ఇంక మనం హంతకుడిని పట్టుకోవాల్సి వుంది—" అన్నాడు వెంకన్న.

"అందుకూ ఏదైనా పథకం వేశారా?" అన్నాడు ఇనస్పెక్టర్.

"క్రోటన్సు ఆకు గురించి పేపర్లో ప్రకటించానుగదా-అతడు మళ్ళీ హోటలుకు తప్పక వెడతాడని నా నమ్మకం. అతడా గదిని తన గురించి నాలుగు రోజులు

బుక్ చేశాడు....” అన్నాడు వెంకన్న—“మీరూ వస్తే రండి—ఇప్పుడు నేను అన్నపూర్ణా హోటలుకు వెడుతున్నాను—...”

ఇనస్పెక్టర్ లేచి నిలబడి—“అఫిషియల్ గా నాకు ఈ ఇన్వెస్టిగేషన్ తో సంబంధం లేదు. నాకు సంబంధించినంతవరకూ ఈ హత్య కేసు తేలిపోయింది. హంతకుడు దొరికేశాడు. కానీ మీ పరిశోధన చాలా ఆసక్తికరంగా ఉన్నది. చూస్తాను—” అన్నాడు.

“యూ ఆర్ వెల్ కం. కానీ తొందరపడి శశికాంత్ పై ఛార్జి షీట్ ఫైల్ చేయకండి. కొద్ది రోజులు వేచి చూడండి. నా పరిశోధన మన పరిశోధనగా మార్చడానికి నాకు అభ్యంతరం లేదు—” అన్నాడు వెంకన్న.

“థాంక్యూ—” అన్నాడు ఇనస్పెక్టర్.

ఇద్దరూ కలిసి అన్నపూర్ణా హోటలు చేరుకున్నారు. అక్కడ మేనేజరు వారిద్దరికీ స్వాగతం పలికాడు. వెంకన్న వంక చూస్తూ — “నమస్కారమండీ! అతను వచ్చాడు. ప్రస్తుతం రూం లోనే ఉన్నాడు—” అన్నాడు.

వెంకన్న కళ్ళు పెద్దవయ్యాయి. ఇంత సులభంగా అతడు తమకు దొరుకుతాడని అనుకోలేదు.

“ఎంత సేపయిందతడు వచ్చి?” అన్నాడు వెంకన్న.

“అయిదు నిమిషాలయింది. మీకు ఫోను చేద్దామనుకుంటూండగా మీరే వచ్చారు—” అన్నాడు మేనేజరు.

“అయితే అర్జంటుగా వెళ్ళి అతణ్ణి కలుసుకోవాలి” అన్నాడు వెంకన్న.

ముగ్గురూ బయల్దేరి రూం నెంబరు పదకొండు చేరుకున్నారు.

తలుపులు దగ్గరగా వేసి వున్నాయి.

మేనేజరు తలుపు తోశాడు. గదిలో ఎవరూ లేరు. అతడు చటుక్కున బాత్రూంలోకి వెళ్ళి చూశాడు. అక్కడా ఎవ్వరూ లేరు.

వెంకన్న వంగి పరిశీలించడం అయింది. అతడు తిరిగి వచ్చిన మేనేజరు వంక చూసి — "అతడు వచ్చిన పని అయింది. క్రోటన్సు ఆకు తీసుకుని వెళ్ళిపోయాడు. ఇప్పుడు మనం త్వరగా అతడేమైనాడో తెలుసుకోవలసి ఉంది—" అన్నాడు.

విచారించగా అతడు గది తలుపులు తెరిచిన రెండు క్షణాల్లోనే వెళ్ళిపోయినట్లు తేలింది.

"అతడు క్రోటన్సు ఆకుకోసం వచ్చాడు. మరింకేం పనీ లేదతడికి. క్షణం కూడా ఇక్కడుండటం ఇష్టంలేదతడికి. వచ్చిన వెంటనే వెళ్ళిపోతే అనుమానించడం జరుగుతుందని భయపడి మేనేజరుకు తెలియకుండా వెళ్ళిపోయాడు. అయితే వాంతకుడు తను తప్పించుకున్నాననే అనుకుంటున్నాడు. అందువల్ల అతడు కాసేపాగి మీకు ఫోనుచేసి తను గది ఖాళీ చేస్తున్నానని చెప్పవచ్చు. అతడిని పట్టుకునేందుకదే ఓ పెద్ద ఆధారం కాగలదు. నేనీరోజు మీ దగ్గరే కాపలా కాస్తాను" అన్నాడు వెంకన్న ఏదో ఆలోచిస్తూ.

ఇనస్పెక్టర్ వెంకన్న భుజం తట్టి—"అమూల్యమైన మీ కాలం వృధా చేయకండి. ఈ రోజు ఈ మేనేజరుకు వచ్చిన ఫోనుకాల్సన్నీ ఎక్కడ్నించి వస్తున్నాయో తెలుసుకునే ఏర్పాటు చేస్తాను. మనక్కావలసిన కాల్ రాగానే క్షణాలమీద ఆ మనిషిని పట్టిస్తాను—" అన్నాడు.

"చాలా థాంక్స్ మిస్టర్ ఇనస్పెక్టర్!" అన్నాడు వెంకన్న.

అయితే వారి ప్రయత్నం ఫలించలేదు. హంతకుడి నుంచి ఫోనుకాల్ రానేవచ్చింది మేనేజరుకు.

"హలో! రూం నెంబరు పదకొండులో నాకింక పని లేదు. మీరది ఇంకెవరికైనా ఇచ్చుకోవచ్చు—"

చాలా క్లుప్తంగా చేయబడ్డ ఆ కాల్ ఆ మనిషిని పట్టుకునేందుకు సహకరించలేదు. అతడిని మరి కాసేపు మాట్లాడేలా చేయాలనుకున్న మేనేజరు ప్రయత్నమూ ఫలించలేదు.

5

"కేసంతా మొదటికి వచ్చింది—"అన్నాడు వెంకన్న.

"బాస్ — మీరేమీ అనుకోనంటే నాదో చిన్న పాయింటు—" అంది సీతమ్మ భయం భయంగా.

"అనుకోవడమెందుకు? ధైర్యంగా చెప్పు...."

"గాఢాంధకారంలో ఏమీ కనిపించనప్పుడు ఓ అగ్గిపుల్ల వేస్తాం. అది కాసేపు వెలిగి ఆరిపోతుంది. అది ఆవేలోగా మనక్కావలసింది దొరికిందా—సరేసరి! లేని పక్షంలో ఆ అగ్గిపుల్ల ఇంక పనిచేయదు. రెండో అగ్గిపుల్ల వెలిగించక తప్పదు...." అంది సీతమ్మ.

"సరే— వెలిగించు...." అన్నాడు వెంకన్న.

"మనం హంతకుడి నాటకం తెలుసుకున్నాం. కానీ అతడి ఉద్దేశ్యమేమిటో తెలుసుకోలేదు-" అంది సీతమ్మ.

వెంకన్నకు అర్థమయింది. హత్యకు మోటివ్ ఏమిటో తెలుసుకుంటే హంతకుడి ఆకారంలోని అస్పష్టత మాసిపోవచ్చు.

శశికాంత్‌కు మోటివ్ ఉంది. కాని అతడు నిర్దోషి

అని తను నమ్ముతున్నాడు. రాఘవరావును హత్య చేయ డానికి అవసరమైన మరో కారణ మేమిటో తను తెలుసు కోవాలి.

వెంకన్న ఆ రోజంతా రాఘవరావు గురించి విచారించాడు.

రాఘవరావు చిన్న చిన్న వ్యాపారాలు చేసి డబ్బు బాగా కూడబెడుతున్నాడు. కానీ అతడికి ఎవరితోటీ గొడవలులేవు. తెలిసిన వాళ్ళందరూ అతడు చాలా మంచివాడనే చెబుతున్నారు. శశికాంత్ కూడా రాఘవరావు గురించి అదే మాటలు చెప్పాడు. ఆయన్ను హత్య చేయడానికి ఎవరికీ చేతులురావని అన్నాడతను.

అప్పుడే వెంకన్న శశికాంత్ ని మరో పాయింటు అడిగాడు. మూడు గంటలకు చచ్చిపోయిన రాఘవరావుని ఆరుగంటలకు చూడటం సాధ్యపడదు కాబట్టి శశికాంత్ చూసింది రాఘవరావు వేషంలోని హంతకుడయ్యుంటాడు.

"కాదు. మామయ్యే నాకు బాగా తెలుసు. నా కళ్లు నన్ను మోసం చెయ్యవు. ఆ కళ్ళు, ఆ మీసాలు, ఆ నడక—అన్నీ నాకు బాగా పరిచితం. నేను పొరబడను... హత్యా సమయం నిర్ణయించటంలో పోలీసు డాక్టరు ఏదో పొరపాటు చేసివుంటాడని నా అనుమానం...."

"అయితే నువ్వు గదిలోకి వెళ్ళగానే తలుపు లెవ్వరు వేసివుంటారంటావ్?"

శశికాంత్ తలపట్టుకుని-"నాకంతా అయోమయంగా వుంది!" అన్నాడు.

"హంతకుడు నీ మేనమామకు బాగా పరిచయస్థుడు. ఆయన వేషం, నడవడికలు చక్కగా అనుకరించగల శక్తిగలవాడు—....బాగా ఆలోచించిచూడు. ఆ రోజు

సాయంత్రం నువ్వు చూసిన వ్యక్తిని మరీ మరీ గుర్తు తెచ్చుకో. మీ బంధువర్గంలో కానీ, పరిచయస్తుల్లో గానీ అతడెవరైయుండే అవకాశముందో చెప్పు. నువ్వు హంతకుడివి కావని నాకు తెలిసింది. కానీ హంతకుడెవరో తేలేదాకా నిన్ను రక్షించటం నావల్ల కాదు. నువ్వు చెప్పే సమాధానం నాకెంతో సహకరిస్తుంది...." అన్నాడు వెంకన్న.

శశికాంత్ చాలా సేపు ఆలోచించి—"ఆయన నా మేనమామ రాఘవరావు తప్ప వేరెవ్వరూ కావడానికి వీల్లేదు. ఇంతకన్నా నేనేమీ చెప్పలేను సార్! ఏం చేయను?" అన్నాడు దిగులుగా.

వెంకన్న అతడి భుజం తట్టి—"నువ్వు చెప్పేవన్నీ అబద్ధాలుగానే కనబడుతున్నాయి. కానీ అవే నిజాలని నాకు అనిపిస్తోంది. ఓ నిజం ఋజువయింది. రెండో నిజం ఋజువు చేయటం చాలా కష్టం—నా ప్రయత్నం నేను చేస్తాను. ఆపైన భగవంతుడున్నాడు—" అన్నాడు.

తర్వాత వెంకన్న రాఘవరావు కుటుంబం గురించి పూర్తి ఆరాలు తీశాడు. రాఘవరావు ఆ ఊరొచ్చి అయిదు సంవత్సరాలయింది. అంతకు పూర్వం ఆ కుటుంబం విశాఖపట్నంలో ఉండేదని తెలిసింది.

ఆ రోజే వెంకన్న విశాఖపట్నం బయల్దేరి వెళ్ళాడు.

6

రాఘవరావు హత్య కావించబడిన వారంరోజులకు అతడి కుటుంబం తిరిగివచ్చింది. వాళ్ళెక్కడికి వెళ్ళారో ఏ ఊళ్ళో వున్నారో తెలియక ఇన్స్పెక్టర్ అన్ని రోజులూ శవాన్ని అయిసులో భద్రపరిచి వుంచాడు.

వార్త విని రాఘవరావు భార్య సుందరమ్మ స్పృహ

తప్పి పడిపోయింది. కూతురు అలివేలు ఘొల్లుమంది. కొడుకు చంద్ర బిక్క మొహం వేసుక్కూర్చున్నాడు.

శవం వాళ్ళకు అప్పజెప్పబడింది. దానికి దహన సంస్కారాలు జరిగాయి. అన్ని కార్యక్రమాలూ పూర్తయ్యాక ఇన్స్పెక్టర్ తన ప్రశ్నలు మొదలు పెట్టాడు. రాఘవరావు కుటుంబం ప్రశ్నలకు ఏడుస్తూనే జవాబులిచ్చారు.

పెళ్ళికని వెళ్ళారు. అక్కణ్నించి కొందరు తిరుపతి వెడుతూంటే తామూ వెళ్ళి వచ్చారు.

ఇంటిల్లపాదీ శశికాంత్ ని తిట్టిపోశారు. డబ్బుకోసం అతడింత ఘోరానికి తలపడతాడని తామనుకోలేదన్నారు. వారిద్వారా ఇన్స్పెక్టర్ కు రాఘవరావు వీలునామా చేతికందింది. అందులో లక్షరూపాయలు శశికాంత్ పేరున వ్రాయబడ్డాయి.

రాఘవరావు కుటుంబం పరిస్థితి బాగానే ఉంది. సుమారు పదిలక్షల ఆస్తి వారిది. రాఘవరావు కూతురు అలివేలు శశికాంత్ వర్ణించినంత అందవికారంగానూ లేదు. ఆస్తికోసం కాకపోయినా మామూలుగా కూడా ఆమెను వివాహం చేసుకొనవచ్చు.

"శశికాంత్ కాక వేరే ఎవరిమీదనైనా మీకు అనుమానముందా?" అనడిగాడు ఇన్స్పెక్టర్.

"అసలు శశికాంత్ మీదనే మాకు అనుమానం లేదు. ఆయన దేవుడు. చూస్తూ చూస్తూ ఆయన్ను చంపడానికా దుర్మార్గుడికి చేతులెలాగొచ్చాయో!" అంది సుందరమ్మ.

"అలా కాదు. బాగా ఆలోచించి చెప్పండి. శశికాంత్ నిర్దోషి అనడానికి కూడా కొన్ని సాక్ష్యాధారాలు లభించాయి. హంతకుడు వేరే ఎవరైనా అయితే ఈ

హత్యకు మూలకారణం పగ అయుండాలి. హంతకుడికి ఒక్క రాఘవరావుగారి మీదనే పగ వున్నదో లేక మొత్తం కుటుంబంమీద పగ వున్నదో మనకు తెలియదు. అందువల్ల మీ అందరికీ కూడా ప్రమాదముండవచ్చు. బాగా ఆలోచించి చెప్పండి....మీ కుటుంబం పైనగానీ రాఘవరావు పైనగానీ — వ్యక్తిగతంగానో, వ్యాపార రీత్యానో పగ ఉన్న వ్యక్తులెవరైనా ఉన్నారా?"

సుందరమ్మ తల అడ్డంగా ఊపింది.

ఇన్స్పెక్టర్ అక్కణ్నించి బయటపడ్డాక దారిలో అతడికి వెంకన్న ఎదురయ్యాడు. జీపు, కారు ఒకదాని కొకటి ఎదురుగా ఆగాయి.

"మీరక్కణ్నించే వస్తున్నారా? అయితే నేను మీతోనే వస్తాను. ఇంక వాళ్ళనడిగి తెలుసుకునేవే ముంటాయి?" అన్నాడు వెంకన్న.

ఇద్దరూ పోలీసుస్టేషనుకు వెళ్ళారు. ఇన్స్పెక్టర్ వెంకన్నకు రాఘవరావు కుటుంబంతో తన సంభాషణ ఫలితం వివరించాడు.

వెంకన్న నిట్టూర్చి — "హంతకుడు చాలా అదృష్ట వంతుడు. అతడి గురించి ఎవ్వరూ సరైన సమాచారం ఇవ్వలేకపోతున్నారు. మనకు చాలాసార్లు దొరికినట్లే దొరికి పారిపోతున్నాడు. నాకు విశాఖపట్నంలో కొంత సమాచారం తెలిసింది. రాఘవరావుమీద పగ వున్న వ్యక్తి ఒకడు అయిదు సంవత్సరాలుగా పిచ్చాసుపత్రిలో ఉంటున్నాడు. కొద్ది నెలల క్రితం అతడు హాస్పిటల్నించి పారిపోయాడు. అతడే హంతకుడని నా అనుమానం. అతడు చాలా తెలివిగా రాఘవరావుని మట్టుబెట్టాడు. ఆ కుటుంబంలో మిగతావారిని కూడా వదలడేమోనని

నా అనుమానం. బహుశా ఏ పనివాడి వేషంలోనే ఆ యింట ప్రవేశిస్తాడేమోనని నా అనుమానం. ముందుగా ఆ కుటుంబాన్ని హెచ్చరించాల్సిన అవసరముంది—" అన్నాడు.

"ఆ పని నేను చేస్తాను...." అన్నాడు ఇన్స్పెక్టర్.

"వద్దు. ఇలాంటి హెచ్చరికలు మామూలు మనుషుల ద్వారా అందడం శ్రేయస్కరం. ఇంతవరకూ హంతకుడికి తన ఆచూకీ మనకు తెలిసిందన్న విషయం తెలియదు. మనం అతడిని చాలా జాగ్రత్తగా టాకిల్ చేయాలి—" అన్నాడు వెంకన్న.

తర్వాత వెంకన్న తనకు తెలిసిన ఓ మనిషిద్వారా ఆ యింటికి కబురంపించాడు. కబురందిన గంటకు చంద్రం వెంకన్న ఆఫీసుకు వచ్చాడు.

ముందు తానెవరో చెప్పి — "మీ మనిషి కబురు నాకందించాడండి. అది నేను రహస్యంగా అమ్మకు చెప్పేను. ఎందుకంటే పోలీసిన్స్పెక్టర్ అలా వెళ్ళగానే ఇలా మా ఇంటికో మనిషి వొచ్చాడండి. వాడి ముఖం సినిమాల్లో రౌడీలదిలాగుందండి. మా ఇంట్లో పనికావాలన్నాడు' వెంటనే ఒప్పేసుకుందమ్మ. అయితే రేపే వచ్చి పనిలో జేరతానన్నాడు. అందాకా యిల్లు సర్దివెడతానన్నాడు. ఈలోగా మీకబురొచ్చింది. భయం వేసి అమ్మకు రహస్యంగా ఈ కబురందించాను. వాణ్ని ఇంట్లోనే ఎలాగో అలా మరి కాసేపుంచమని అమ్మకు చెప్పి మీ దగ్గరకు బయల్దేరి వచ్చాను—" అన్నాడు చంద్రం.

వెంకన్న లేచాడు. వాళ్ళిద్దరు కార్లో రాఘవరావు యింట్లోకి చేరుకు నేందుకు ఎంతో సేపు పట్టలేదు.

వాళ్ళను చూస్తూ సుందరమ్మ—"ఆయన వెళ్ళిపోయా డండి—" అంది.

"ఆయనెవరు?" అన్నాడు వెంకన్న.

"అదే—మా ఇంట్లో పనికనివచ్చినాయన...." అంది సుందరమ్మ.

"మరి నేను....కాసేపు...." అని చంద్రం ఏదో అనబోయాడు.

"నువ్వేంకేమీ అనొద్దు...." అన్నాడు వెంకన్న. అతడు సుందరమ్మకు జాగ్రత్తలు చెప్పి వెళ్ళిపోయాడు.

7

రాజమ్మ, సీతమ్మ చాలాసేపట్నించి ఆ ఫోటోతో కుస్తీపడుతున్నారు. దాన్ని చూసి ఇద్దరూ రకరకాల బొమ్మలు గీస్తున్నారు.

వెంకన్న వంటింటిలోంచి వచ్చి—"ఏం చేశారు?" అన్నాడు.

"బాస్! ఇది చాలా విచిత్రంగా వుంది—" అంది సీతమ్మ.

"ఏమిటి?"

"ఈ ఫోటోకు రకరకాల వేషాలు వేయాలని ప్రయత్నిస్తూంటే ఇందులో రాఘవరావు పోలికలు కనబడుతున్నాయి—" అంది సీతమ్మ.

"వ్వాట్!" ఉలిక్కిపడ్డాడు వెంకన్న. ఒక్కసారి అతడి బుర్రలో ఏదో మెరుపు మెరిసినట్లయింది.

"కానీ — ఈ ఫోటోని మీరు పిచ్చాసుపత్రినుంచి పారిపోయి వచ్చిన వాంతకుడిదని చెప్పినట్లు గుర్తు—" అంది రాజమ్మ.

అందులో అబద్ధమేమీ లేదు. పిచ్చాసుపత్రినుంచి పారి

పోయిన ఆ వ్యక్తి ఫోటో వెంకన్న సంపాదించాడు. అతదే హంతకుడని వెంకన్న నమ్ముతున్నాడు. అందుకని ఆ ఫోటో సీతమ్మకూ, రాజమ్మకూ ఇచ్చాడు. హంతకుడు రకరకాల మారువేషాలతో ఊళ్ళో తిరుగుతూండవచ్చు. ఆ వేషాల నంచనా వేయడానికి రకరకాల బొమ్మలు గీయమని అసిస్టెంట్సుకు చెప్పాడు.

అంటే పిచ్చాసుపత్రినుంచి పారిపోయిన వ్యక్తే రాఘవరావా?

రాఘవరావు మూడు గంటలకు చనిపోయాడు. శశికాంత్ రాఘవరావుని ఆరుగంటలకు చూశాడు. రెండూ నిజమేనా?

అంటే రాఘవరావు లిద్దరున్నారా?

వెంకన్న పోలీసుస్టేషనుకు వెళ్ళాడు. అతడిచేతిలో ఓ చిన్న రేడియో వుంది. అతడది ఇన్స్పెక్టర్ కు అందించాడు.

"ఏమిటిది?" అన్నాడు ఇన్స్పెక్టరు.

"నేను రోడ్డుమీదికి వెళ్ళి మాట్లాడతాను. నా మాటలు మీరు రేడియోలో వింటారు. కొద్దిరోజులపాటు మీరీ రేడియోను అలా ఆన్ లోనే ఉంచండి. చాలా విశేషాలు తెలుస్తాయి—" అన్నాడు వెంకన్న.

"చట్టరీత్యా ఇది నేరం. మీ మాటలు మరో రేడియో స్టేషను లో కార్యక్రమాలని దెబ్బతీయవచ్చు —" అన్నాడు ఇన్స్పెక్టర్ కంగారుగా.

"అలా కంగారు పడకండి ఇన్స్పెక్టర్. నేను మీకు యిచ్చినది మీడియం వేవ్ రేడియోకాదు. ఎఫ్. ఎమ్. రేడియో. మన రాష్ట్రంలో ఎఫ్.ఎమ్. కార్యక్రమాలేలేవు. అందువల్ల ఏ ఫ్రీక్వెన్సీ వాడుకున్నా పర్వాలేదు. హంత

కుణ్ని రెడ్ హాండెడ్ గా పట్టుకుందుకు ఇది చాలా అవసరం....” అన్నాడు వెంకన్న.

“మీరిప్పుడేం చేస్తారు?” అన్నాడు యిన్స్పెక్టర్.

“రేడియోలో విని తెలుసుకోండి-” అంటూ బయటకు నడిచాడు వెంకన్న. కారు స్టార్టయిన కొద్ది క్షణాల్లోనే రేడియోలో మాటలు వినబడసాగాయి — “మైడియర్ యిన్స్పెక్టర్! నేనిప్పుడు రాఘవరావు యింటికి వెడుతున్నాను. అక్కడ మైక్రోఫోను ఫిక్స్ చేసి వస్తాను. హాంతకుడు మళ్ళీ అక్కడకు వస్తాడు. అందుకని మీరు రేడియోవద్ద అను నిత్యం ఎవరో్న కాపలా ఉంచండి. అతను వచ్చిన సూచనకాగానే క్షణాలమీద వెళ్ళి బంధించండి....”

ఇన్స్పెక్టర్ ఆశ్చర్యంగా అంతా వింటున్నాడు.

కొద్దిక్షణాల్లో వెంకన్నకూ, సుందరమ్మకూ మధ్య సంభాషణ వినబడింది. యిన్స్పెక్టరు శ్రద్ధగా వింటున్నాడు....

“మిమ్మల్ని చాలా పర్యాయాలు యిబ్బంది పెట్టవలసి వస్తోంది—”

“అయ్యో — యిబ్బంది ఏముందండీ—మా క్షేమం కోరేవారు మీరు....”

“మీ వారి కుటుంబం గురించి అత్యవసరమైన సమాచారం కావాలి....మీకు తెలిసివుంటుందని నా నమ్మకం. మీ వారికి ఓ అన్న ఉన్నాడు కదూ?”

“అన్న కాదు—తమ్ముడు!” అంది సుందరమ్మ.

“కవలపిల్లల్లో అన్నెవరో, తమ్ముడెవరో చూసి తెలుసుకోవడం చాలా కష్టంగదా—అందుకని అన్న అనుకున్నాను....” వెంకన్న ఆగాడు.

"మీరు మా మరిదిని చూశారా, ఎప్పుడు?"

సుందరమ్మ కంఠంలో ధ్వనించిన ఆత్రుత ఇంతా అంతా అని చెప్పడం కష్టం.

"చూడ్డం సంగతలా ఉంచండి. అతడికి అన్నగారి మీద అంతులేని పగ వుంది. కారణం?" అన్నాడు వెంకన్న.

సుందరమ్మ నిట్టూర్చింది—"పగ ఉన్నమాట నిజమే! అన్న సంపాదిస్తూంటే తమ్ముడు తగలేస్తూండేవాడు. అదేమనడానికి లేదు. గట్టిగా ఏమైనా అంటే నాన్న యిచ్చింది చెరిసగం చేసేయ్-నా దారిన నేను పోతాను. అనేవాడు. తమ్ముడంటే ఆయనకు పిచ్చి అభిమానం. నిజానికి తండ్రినుంచి ఆయనకు సంక్రమించినదేమీ లేదు. కానీ కొంత డబ్బిచ్చి తమ్ముణ్ని వదిలించుకుంటే అతడు పూర్తిగా చెడిపోతాడని ఆయన భయపడి అతడి ఆగడాలను భరిస్తూ తన అదుపులోనే ఉంచుకున్నారు.

అయితే రానురాను అతడి ఆగడాలు మితిమీరాయి. యింట్లోంచి డబ్బు తగలేయటం సంగతటుంచి పరువు తక్కువ పనులు చాలా చేసేవాడు. ముఖ్యంగా ఆడవాళ్ళ పట్ల అసభ్యంగా ప్రవర్తించడం. ఓసారి కాలేజీ అమ్మాయిల వెంట బడ్డాడని పోలీసుల రెస్టు చేసి తీసుకుని వెడితే ఆయన వారి కాళ్ళావేళ్ళాపడి ఎలాగో విడిపించి తీసుకుని వచ్చారు.

ఇంట్లో కూడా అతడి ప్రవర్తన బాగుండేది కాదు. వదినగారినన్న గౌరవం లేకుండా నా వంక అదోలా చూసేవాడు. కొన్నాళ్ళు సహించినా చివరకు ఆయనకు చెప్పేశాను. అప్పటికీ ఆయన కోపగించుకోలేదు. తనకు తెలిసిన సైకాలజిస్టుని సంప్రదించారు.

ఆయన నా మరిదిని పరీక్షించి-అతడికి పిచ్చి ఉన్నదని తేల్చారు. ఆ విధంగా అతడు పిచ్చాసుపత్రికి తరలించ బడ్డాడు. తనకు పిచ్చిలేదనీ, ఇది అన్నగారు పన్నిన కుట్ర అనీ అతడు అరుస్తూండేవాడు. వారు అన్ని బాధ్యతలూ సైకాలజిస్టు మిత్రుడికి అప్పజెప్పి—తానింక ఆ ఊళ్ళో ఉండలేనని ఇక్కడకు తరలివచ్చారు—"

"చాలా తమాషాగా ఉంది-" అన్నాడు వెంకన్న—"ఇప్పుడతడి పిచ్చి తగ్గి బయటకు వచ్చాడంటారా? యింకా పిచ్చివాడుగానే ఉన్నాడంటారా? యింత తెలివిగా పథకంవేసి హత్యచేసినవాడు పిచ్చివాడంటే నాకు నమ్మకం కలగడం లేదు—"

"అతడిది మామూలు పిచ్చికాదు. అదో రకంపిచ్చి. మనుషుల్ని బాధించడం, నేరాలు చేయడం అతడికి సరదా. ఏం చేసినా ఓ పథకం ప్రకారం చేసేవాడు. పథకాలు చాలా తెలివిగానే ఉంటాయి. కానీ అది తెలివికాదు. పిచ్చి. సైకాలజిస్టు చెప్పేవరకూ మాకా విషయం తెలియలేదు...." అంది సుందరమ్మ.

"విశాఖపట్నంలోని ఆ సైకాలజిస్టు ఎవరో నేను తెలుసుకోనవచ్చా?" అనడిగాడు వెంకన్న.

సుందరమ్మ తడబడింది. వెంకన్న నొక్కించడంతో ఆమె సైకాలజిస్టు పేరు, చిరునామా కూడా చెప్పింది.

అప్పుడు వెంకన్న—"ఒక్కసారి మీ యిల్లు సోదా చేయాలి. హంతకుడి ఆచూకీ తెలుసుకునేందుకు ఈ సోదా చాలా అవసరం...." అన్నాడు.

"అంటే శశికాంత్ హంతకుడని మీరు నమ్మడం లేదా?" అంది సుందరమ్మ.

"శశికాంత్ హంతకుడని మీరు నమ్మాలనుకుంటు న్నారా?" ఎదురు ప్రశ్న వేశాడు వెంకన్న. సుందరమ్మ ఏమీ మాట్లాడలేదు. గదుల సోదా పేరు చెప్పి వెంకన్న ఒకో గదీ చూసి—రాఘవరావు పడక గదిలోకి వెళ్ళాక సుందరమ్మను బైట నిలబడమని తను లోపల తలుపులు వేసుకున్నాడు. కూడా తెచ్చిన మైక్రోఫోను ఎవరూ అనుమానించనిచోట జాగ్రత్తగా ఉంచి గది తలుపులు తీసి—"మీ ఇంట్లోంచి నేనేమీ తీసుకుని పోవటంలేదు" అంటూ తన జేబులు బైటకుతీసి చూపించాడు.

"అయ్యో! పేరుమోసిన డిటెక్టివ్‌లు. మిమ్మల్ని నేనెందుకు అనుమానిస్తాను?" అంది సుందరమ్మ నొచ్చుకుంటూ.

"అయితే నేనడిగే ఒక ప్రశ్నకు నొచ్చుకోకుండా జవాబివ్వాలి మీరు. నన్ను మీ సోదరుడిగా భావించి."

"అడగండి...." అంది సుందరమ్మ.

"మీ భర్త, మరిది—ఒకే యింట్లో ఉండేవారు. మీ మరిదికి పాడు బుద్ధులున్నాయి. అతడు మిమ్మల్ని కూడా వక్ర దృష్టితో చూసేవాడు. అటువంటప్పుడు అతడు మిమ్మల్ని మోసంచేసి వశపర్చుకునే అవకాశముంది. అందులోనూ అతడు తెలివిగా పథకాలు వేసేవాడం టున్నారు. అతడు తన అన్నగా నటించి...."

"ఆగండి!" అంది సుందరమ్మ.

"ఆగుతాను. కానీ నా ఉద్దేశ్యంలో తప్పేమీ లేదు. అన్నదమ్ములిద్దరిదీ ఒక్కటే పోలిక. ఆ అవకాశాన్నతడు ఉపయోగించుకున్నాడా, లేదా...."

"తమ్ముడి గురించి ఆయనకు పూర్తిగా తెలుసు. అందుకని ఆయన నాకు కొండ గుర్తులు చెప్పారు.

ఆవేమిటో నేను చెప్పను. అయితే నా మరిది ఆలాంటి కొన్ని ప్రయత్నాలు చేశాడనీ, వారు చెప్పిన కొండ గుర్తుల సాయంతో నా పవిత్రతను కాపాడుకోగలిగాననీ మాత్రం చెప్పగలను....” అంది సుందరమ్మ.

“నన్ను మన్నించండి. నేర పరిశోధనలో ఒకోసారి కొందరి మనసు కష్టపెట్టవలసి వస్తుంది. అయితే ఒక నిర్దోషి ప్రాణాలు కాపాడబడుతున్నాయంటే—మీరు మనసు కష్టపెట్టుకుంటారనుకోను—” అని అక్కణ్నించి కదిలాడు వెంకన్న.

8

“నమస్కారం వీరేశంగారూ—నా పేరు వెంకన్న!”

“ప్లీజ్—కూర్చోండి!” అన్నాడు వీరేశం.

“కూర్చుంటాను. మీమీద ఎన్నో ఆశలు పెట్టుకుని వచ్చాను. మీరు మనుషుల మనస్తత్వాల్ని అర్థం చేసుకుని వారికి సాయపడటమే తప్ప—వారిలోని తప్పుల్ని దాచి వారిని నేరాలకు ప్రోత్సహించరన్న నమ్మకమే నన్ను మీ దగ్గరకు రప్పించింది. నేను డిటెక్టివును. ఓ హత్య కేసు విషయమై పరిశోధిస్తూ ఇక్కడకు వచ్చాను. ఆ కేసు స్వరూపం తేలిపోయే సమాచారం మీ వద్ద వున్నది—” అన్నాడు వెంకన్న కుర్చీలో కూర్చుంటూ.

వీరేశం నిబ్బరంగా వెంకన్న వంక చూసి-“నానుంచి మీరేమాశిస్తున్నారో తెలియదు. కానీ అడగండి. నాకు తెలిసింది మీకు చెబుతాను. హత్యకేసు అంటూంటే ఆశ్చర్యంగా ఉంది—” అన్నాడు.

వెంకన్న క్లుప్తంగా రాఘవరావు హత్య గురించి చెప్పి—“శశికాంత్ అనే అమాయకుడీ కేసులో ఇరుక్కున్నాడు. అతడిని మీరే రక్షించాలి—” అన్నాడు.

"ఎలా?" అన్నాడు వీరేశం.

"రాఘవరావు తమ్ముడి గురించి చెప్పండి. అతడు పిచ్చాసుపత్రినుంచి పారిపోయిన వైనం మీకు తెలిసే వుండాలి...."

వీరేశం సాలోచనగా-"డాక్టరుగా కొన్ని వ్యక్తిగత విషయాలను రహస్యంగా ఉంచవలిసిన బాధ్యత నా మీద ఉంది. ఈ కేసులో మీకు నేను సాయపడ లేనేమో!" అన్నాడు.

"మీరు సాయపడేది నాకు కాదు—ఓ నిర్దోషికి! మీరు సాయపడకపోతే నిష్కారణంగా అతడు ఉరికంబ మెక్కుతాడు...."

"నా కష్టమర్స్ రహస్యాలు నేను దాచి ఉంచని పక్షంలో నా వృత్తి కూడా దెబ్బ తింటుంది—" అన్నాడు వీరేశం.

"మీ వృత్తికేవిధమైన దెబ్బ తగలదు. అసలీ కేసులో మీ పేరు బయటకు రాకుండా చూసుకుంటాను...." అన్నాడు వెంకన్న.

వీరేశం రాఘవరావు కథ నెమ్మదిగా చెప్పాడు.

రాఘవరావు, మాధవరావు అన్నదమ్ములు. పెద్దవాడు రాఘవరావు. ఇద్దరికీ చిన్నతనంలోనే తల్లిపోయింది. పెద్దవాడైన రాఘవరావు వివాహం జరిపించి తండ్రి చనిపోయాడు.

మొదట్నుంచీ రాఘవరావుది వక్రబుద్ధి. ఎదుటివాళ్లను ఏడిపించటంలో అతడు అందెవేసిన చేయి. అదే అతడి జీవిత లక్ష్యం కూడా. వ్యాపార వ్యవహారాలన్నీ రాఘవరావు పేరుమీద మాధవరావే చూసేవాడు. మాధవరావు నెమ్మదస్థుడు. మర్యాదస్థుడు. వీరేశానికి

స్నేహితుడు. అతడు తన ఇబ్బందులన్నీ వివరంగా చెప్పుకునేవాడు.

మాధవరావుకు వివాహమైతే కుటుంబంనుంచి విడిపోయి వేరు కాపురం పెడతాడని రాఘవరావు భయం. అందుకని అతడు తెలివిగా ఉపాయం పన్ని మాధవరావుకు వచ్చే సంబంధాలన్నీ చెడగొడుతూండేవాడు. రాఘవరావు చేసేచెడ్డపనులన్నీ మాధవరావే చేస్తున్నట్లు బయటివారికి భ్రమ కలిగించేవాడు. ఆ విధంగా రాఘవరావు కులాసాగా తిరిగేవాడు. అమర్యాదగా ప్రవర్తించేవాడు. చెడ్డ పేరు మాధవరావుకి వచ్చేది. మాధవరావు ఇది కూడా సహించాడు.

రాఘవరావు భార్య సుందరమ్మ వయసులో చాలా అందంగా ఉండేది. రాఘవరావు ఆమె వద్ద చాలా ట్రిక్కులు వేసేవాడు. ఉదయం ఎనిమిదింటికి ఆమెతో కాసేపు సరసాలాడేవాడు. తర్వాత తొమ్మిదింటికి మళ్ళీ వెళ్ళి—"ఈ రోజు తొలిసారిగా నీ భుజం తాకుతూంటే నాకేదోలాగుంది—" అనేవాడు. ఆమె కంగారుపడి—"తొలిసారిగా అంటారేమిటి? ఓ గంట క్రితం వచ్చి వెళ్ళారుగా—" అనగానే—"అయితే ఆ మాధవగాడు వచ్చి ఉంటాడు—" అనేవాడు.

ఈ విధంగా రాఘవరావు కొంతకాలం భార్యకూ, తమ్ముడికీ మనఃస్థిమితం లేకుండా చేశాడు. అయితే అతడి నాటకాన్ని భార్య పసిగట్టేసింది. రాఘవరావుని పసిగట్టడానికి ఆమె కొన్ని కొండ గుర్తు లేర్పరుచుకుంది. అతడు మాధవరావులా నటించినా ఆమె క్షణాలమీద అతడి నాటకాన్ని బయటపెట్టేది. భార్యను మానసికంగా హింసించడం సాధ్యంకాదని తెలిసేక అత

డామెను శారీరకంగా హింసించడం ఆరంభించాడు. ఆ బాధలనామె భరించలేక ఆఖరికి సిగ్గు విడిచి మరిదికి చెప్పుకుంది.

మాధవరావు వీరేశం దగ్గరకు వచ్చాడు. వీరేశం తను స్వయంగా రంగంలోకి దిగకుండా పరోక్షంగా రాఘవరావుని నీడలా వెన్నంటాడు. రాఘవరావు పిచ్చివాడు కాడు. దుర్మార్గుడు. కొందరు దుర్మార్గుల్ని మానసిక శాస్త్రవేత్తలు బాగుచేయగలరు. కానీ కొందరు దుర్మార్గులకు శిక్ష ఒక్కటే మార్గం. రాఘవరావు రెండో తరహాకు చెందిన మనిషి. పిచ్చి అని పేరు చెప్పి అతడిని పిచ్చాసుపత్రిలో జేర్చడం అతడికి సరైన శిక్ష అని వీరేశం అభిప్రాయపడ్డాడు.

ఈ పథకం మాధవరావుకి ముందు నచ్చలేదు. కానీ అంతకుమించి గత్యంతరం లేదని గ్రహించడానికి ఎంతో సేపు పట్టలేదు.

రాఘవరావు దుర్మార్గుడు. కానీ తెలివైన దుర్మార్గుడు. అతడికి ఉచ్చనీచాలు లేవు. వావివరుసలు లేవు. మాధవరావుకు వేరే వివాహావకాశం లేకుండా చేశాడు. అతడు చెడ్డవాడన్న భ్రమ ప్రపంచానికి కలిగించాడు. అయితే మాధవరావతడికి బంగారు గ్రుడ్లు పెట్టే బాతు. అతడినెలా వదులుకోగలడు? అందుకని భార్యను శారీరకంగా హింసించి, మానసికంగా ప్రోత్సహించి మాధవరావు పట్ల ఆకర్షితురాలయ్యేలా చేశాడు. వారిద్దరికీ అనుకూల పరిస్థితులు తనే ఏర్పరిచాడు.

ఆ విధంగా సుందరమ్మ పరిస్థితుల ప్రభావానికి లోనై ఇద్దరన్నదమ్ములతోటీ కాపురం చేసింది. ఆమెకు పుట్టిన బిడ్డలు యెవరి బిడ్డలో ఆమెకూ తెలియదు. మొదట్లో

జుగుప్సాకరంగా అనిపించినా ఆ రకం జీవితానికి ఆమె అలవాటుపడిపోయింది. పిల్లలు పెరిగి పెద్దవారవుతున్నా రాఘవరావులో మార్పు రావడంలేదు. ఆమెకు బెంగగా ఉండేది — ఆ పసి హృదయాలు రాఘవరావు ప్రభావానికి గురికాకుండా తను కాపాడగలనా అని!

ఈ పరిస్థితుల్లో వీరేశం సలహా మాధవరావుకూ, సుందరమ్మకూ అమృత ప్రాయంగా తోచింది.

ఎలాగూ మాధవరావుకు కొంత చెడ్డ పేరుంది. రాఘవరావు తీసిన గోతిలో అతడే పడే ఏర్పాటు చేశాడు మాధవరావు. తాగి తందానాలాడుతూ తను మాధవరావునని చెప్పుకుంటున్న సమయంలో అతడిని మాధవరావు పిచ్చాసుపత్రిలో జేర్పించాడు. ఆ క్షణం నుంచీ రాఘవరావు మాధవరావుగా పిచ్చాసుపత్రిలో ఉన్నాడు. మాధవరావు రాఘవరావుగా సుఖజీవనం చేస్తున్నాడు.

తనకు అగ్నిసాక్షిగా తాళికట్టిన భర్త పిచ్చాసుపత్రిలో ఉన్నందుకు సుందరమ్మ కాస్త బాధపడింది. కానీ సమస్యలు లేని సుఖ జీవనం, పిల్లల భవిష్యత్తు— ఆమెను పరిస్థితులకు రాజీపడేలా చేశాయి. అందులోనూ లోకం దృష్టిలో రాఘవరావే తన భర్త! తనతో ఇప్పుడుంటున్నదీ లోకం దృష్టిలో రాఘవరావే!....

"మొత్తంమీద రాఘవరావు పిచ్చాసుపత్రి నుంచి పారిపోయి తమ్ముడిమీద పగతీర్చుకున్నాడన్నమాట!" అన్నాడు వీరేశం.

"చాలా ఆశ్చర్యంగా ఉంది మీ కథ! కానీ ఎంతో తెలివిగా పథకాలు వేసే రాఘవరావు ఇందులో శశికాంత్‌ని ఇరికించడంలో ఉద్దేశ్యమేమిటో?"

"ఏముంది? తన తమ్ముడు పుట్టపన్ని తనను పిచ్చాసుపత్రిలో వేసి—తన భార్యతో కులుకుతున్నాడనీ-అందుకు తగ్గ చావు వాడికి లభించిందనీ లోకానికి చెప్పి—మళ్ళీ సుందరమ్మ మెడకు గుదిబండై కూర్చుందామని పథకం వేసి ఉంటాడు. కానీ మీరు తీగెలాగి డొంకంతా కదిపారు. అర్జంటుగా వెళ్ళి ఆ దురాత్ముడిని పట్టించండి. అవసరమైతే నేనూ ముందుకు వస్తాను. తాళికట్టిన భర్త గదా అని ఆ సుందరమ్మ అతడికి సహకరించే అవకాశం కూడా ఉంది. కానీ అతడి కారణంగా ఆ కుటుంబం సర్వ నాశనమైపోగలదు. ఎలాగో అలా ఆ నీచుణ్ని మీరు బంధించండి...."

వెంకన్న లేచి నిలబడి-"థాంక్యూ డాక్టర్ వీరేశం!" అన్నాడు.

9

వెంకన్న ఇంటికి వెళ్ళేసరికి అక్కడ శారద కనబడింది. ఆ ప్రక్కనే శశికాంత్ ఉన్నాడు. అతడు చాలా ఆశ్చర్యపడ్డాడు.

"మీ ఏర్పాటు అద్భుతం సార్! నిన్న రాత్రి పోలీసులు మాధవరావును పట్టుకున్నారు—" అంది రాజమ్మ.

"మాధవరావంటే?" అన్నాడు వెంకన్న.

"రాఘవరావు తమ్ముడు. పిచ్చాసుపత్రినుంచి పారిపోయివచ్చి అన్నను హత్యచేశాడు...." అంది సీతమ్మ.

మాధవరావు ఆ రాత్రి సుందరమ్మను రహస్యంగా కలుసుకుందుకు వెళ్ళాడు. పడకగదిలో వారిద్దరి సంభాషణ పోలీసు స్టేషన్‌లో పలికింది. క్షణాలమీద పోలీసులు వెళ్ళి అతడిని అరెస్టుచేశారు.

డిటెక్టివ్ వెంకన్న ఇచ్చిన వేలిముద్రలతో అతడి వేలిముద్రలు సరిపోయాయి. హత్య ఎలా జరిగిందో వెంకన్న అతడినెలా ట్రేస్ చేశాడో ఇన్స్పెక్టరు చెప్పినపుడు మాధవరావుకు కలిగిన ఆశ్చర్యమింతా అంతా కాదు. అతడు తను చేసిన నేరం ఒప్పుకున్నాడు. పిచ్చాసుపత్రినుంచి పారిపోయి వచ్చి శశికాంత్ ని ట్రాప్ చేసి తెలివిగా అతణ్ని హత్యలో ఇరికించి తర్వాత సుందరమ్మ జీవితంలో ప్రవేశించాలనుకున్నాడుట. కానీ అతడి పథకం ఫలించలేదు. శశికాంత్ ని తనెలా ట్రాప్ చేసిందీ అతడు వివరించాడు. శశికాంత్ అతడి వేషాలు గుర్తుపట్టాడు.

ఆఖరున హంతకుడు రెండు కోరికలు కోరాడు. తను ఎంతో పకడ్బందీగా వేసుకున్న పథకం ఫెయిలవడానికి కారణం ఇద్దరు. ఒకడు శశికాంత్. ఇతడు అమాయకుడు. మంచివాడు. అతణ్ని మోసం చేయాలని అనుకోవటం వల్లనే తనకీ దుర్గతి పట్టింది. రెండోవాడు వెంకన్న. కోడిగుడ్డుకు ఈకలులాగే తెలివితేటలతో, నీటిలో జాడలుతీసే నైపుణ్యంతో వ్యవహరించి తన నేరాన్ని పూర్తిగా బైటపెట్టాడు. ఇలాంటివారున్నారని ప్రచారమయిందంటే నేరస్థులు భయపడక తప్పదు.

ఈ ఇద్దరినీ హంతకుడు కలుసుకోగోరాడు. శశికాంత్ ని అతడు కలుసుకున్నాడు. తన తప్పుకు మన్నించమని వేడుకున్నాడు. ఎందుకంటే వచ్చే జన్మలో ఎవరి ఉసూరు తనకు తగలకూడదట....

వెంకన్నను కలుసుకోవడం కోసం అతడు తహతహలాడుతున్నాడు. ఇది వినగానే అతడిని కలుసుకుని చూడాలని వెంకన్న కూడా తహతహలాడాడు.

వెంకన్న తిన్నగా పోలీస్ స్టేషన్ కు వెళ్ళాడు. అక్కడ

ఇన్స్పెక్టరు అతడికి ఘనస్వాగతం పలికి అభినందనలతో ముంచెత్తి—"శాంతవుడు మీతో కొద్ది క్షణాలు మాట్లాడాలని...." అని ఏదో అనబోతూండగా—

"నాకూ తెలుసు....తహతహలాడుతున్నాడు గదా!" అన్నాడు వెంకన్న. తర్వాత అతడు శాంతవుడిని కలుసుకున్నాడు.

"డిటెక్టివ్ వెంకన్నగారూ! మీకు నా జోహార్!" అన్నాడు రాఘవరావు. వెంకన్న ఇంకా ఏదో అనబోతూండగానే—

"మీ మేధాశక్తికి అన్నీ తెలిసే ఉంటాయి. చిన్నతనంనుంచి నేనో శాపగ్రస్తుణ్ని. అంతా నా దురదృష్టం. నాదంటూ నాకేమీ మిగలకుండా పోయింది. ఎందుకు బ్రతుకుతున్నానో, నా జీవితానికర్థమేమిటో తెలియకుండానే జీవనం కొనసాగించాను—" అని.

"అదంతా ఇప్పుడెందుకులెండి! మొదట్నుంచీ రాఘవరావుకు మంచి పేరుంది. ప్రపంచంలో అతడికున్న ఆ మంచి పేరును పోగొట్టకండి. పిచ్చాసుపత్రినుంచి పారిపోయి వచ్చిన మాధవరావే రాఘవరావును హత్య చేశాడని అంతా అనుకుంటూంటే మీరు ఖండించకండి. నేను అన్న స్థానంలో ఇక్కడ గడిపిన అయిదు సంవత్సరాలూ నా జీవితంలో మరువలేనివి.

పిచ్చాసుపత్రినుంచి పారిపోయి వచ్చిన నా అన్నయ్య సరాసరి ఇంటికి రాకుండా నా దగ్గర్నుంచి డబ్బు గుంజాలని బ్లాక్ మెయిలింగ్ ప్రారంభిస్తే అతడిని చంపాలని తెగించాను. నా సుఖ సౌఖ్యాలతోపాటు—సుందరమ్మ—ఆమె బిడ్డల భవిష్యత్తు కూడా దృష్టిలో ఉంచుకొని ఆ నిర్ణయానికి వచ్చాను...." అన్నాడతను.

43

వెంకన్న ఆశ్చర్యంగా—"అయిదేళ్ళుగా ఈ ఊళ్ళో ఉంటున్న రాఘవరావే మరణించాడని నేను నమ్మాను. కానీ అది నిజంగాదన్నమాట....మరణించింది పిచ్చాసుపత్రినుంచి, పారిపోయొచ్చిన రాఘవరావేనన్నమాట!" అన్నాడు. ఇప్పుడు వెంకన్న కళ్ళలో జాలి ఉంది.

"అయిందేదో అయిపోయింది—నా విన్నపం గుర్తుంచుకుంటారు కదూ?" అన్నాడతను దీనంగా.

"ఊఁ" అన్నాడు వెంకన్న ఇంకా అతడి వంక జాలిగానే చూస్తూ.

—:ఐ పో యిం ది:—